క్లుప్తంగా

ఓటుహక్కు నమోదును బాధ్యతగా భావించాలి

పలమనేరు: 18 ఏళ్లు నిండిన వయోజనులు ఓటు హక్కును బాధ్యతగా భావించాలని పలమనేరు ఆర్డీఓ భవానీ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆర్డీఓ మాట్లాడుతూ.. రెవెన్యూ డివిజన్ పరిధిలో నేడు, రేపు, ఈనెల 23న ఓటర్ల నమోదు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వయోజనులు తప్పకుండా ఆయా పోలింగ్ స్టేషన్ల పరిధిలోని బీఎల్వోలను సంప్రదించి ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కడపనత్తం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం

బైరెడ్డిపల్లె: అండర్–17 రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు కడపనత్తం విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం నందగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గత నెల 29న తిరుపతిలో జరిగిన బేస్‌బాల్ పోటీల్లో పాఠశాలలో చదువుతున్న 9.10వ తరగతి విద్యార్థులు పి.బద్రినాథ్, ఏ.స్నేహ, కే.గాయత్రి విజయం సాధించడంతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 11న గుంటూరు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

డ్రైవర్లకు బహుమతి

పుంగనూరు: ఆర్టీసీ బస్సుల్లో ఇంధనం పొదుపు చేసినందుకు డ్రైవర్లు రామనాథ, ఫైరోజ్‌బాషా, కండెక్టర్లు శేషాద్రి, పార్వతమ్మకు బహుమతులు అందజేశారు. శుక్రవారం డీఎం సుధాకరయ్య ఆధ్వర్యంలో ఇంధనం పొదుపు చేసి సంస్థ అభివృద్ధికి కృషి చేసిన నలుగురికి ప్రోత్సాహక బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ సంధ్య పాల్గొన్నారు.

మర్రిమాకులపల్లి విద్యార్థిని ప్రతిభ



చందన

చౌడేపల్లె: మండలంలోని మర్రిమాకులపల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం నాథమునినాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బి.చందన అండర్–14 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 9, 10, 11 తేదీల్లో విజయనగరం జిల్లా భోగాపురంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో చందన ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఈ విద్యార్థిని ఎంపికపై పీడీ పవన్‌కుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అభినందించారు.

కుప్పం డిపోకు రెండు కొత్త బస్సులు



నూతన బస్సులను ప్రారంభిస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం

కుప్పం: కుప్పం ఆర్టీసీ డిపోకు నూతనంగా రెండు బస్సులు మంజూరయ్యాయి. ఈ బస్సులను శుక్రవారం డిపో ప్రాంగణంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుప్పం ఆర్టీసీ డిపో అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నూతనంగా మంజూరైన బస్సులను అవసరమైన మార్గాల్లో నడుపుతామని తెలిపారు.

ఫాస్ట్‌ఫుడ్‌తో అనారోగ్య సమస్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డా.రామలక్ష్మి

పలమనేరు: నేటి సమాజంలో విద్యార్థులు ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటు పడి వారి ఆరోగ్యాన్ని వారే నాశనం చేసుకుంటున్నారని ప్రముఖ మహిళా వైద్య నిపుణురాలు డా.రామలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని వాణి, మధు కళాశాలల విద్యార్థినులకు వ్యక్తిగత ఆరోగ్యం, పరిశుభ్రత అనే అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో పెద్దలు తిన్న ఆహారం కారణంగా వారికి బీపీ, షుగర్ లాంటి రోగాలు దరిచేరలేదన్నారు. కానీ నేడు బడికి వెళ్లే పిల్లల నుంచి ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటు పడి అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు. గతంలో పిల్లలు బడి నుంచి రాగానే ఇంట్లో తయారు చేసిన పిండి వంటలు, మురకలు, నిప్పట్లు, బెల్లం ఉంటలు లాంటివి ఇచ్చేవారన్నారు. కానీ నేడు పానీపూరీలు, పిజ్జా, బర్గర్ల కారణంగానే ఒబేసిటీ తదితర వ్యాధులు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ కృష్ణమూర్తి రెడ్డి, శ్రీవాణి, రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వాహకులు సహదేవనాయుడు, అరుణ పాల్గొన్నారు.

కోట్ల రూపాయల నిధులు కేటాయించి స్వచ్ఛతే లక్ష్యంగా చెత్త నుంచి సంపదను సృష్టించి ఆదాయ వనరులు తీసుకురావడమే ధ్యేయంగా నిర్మించిన చెత్త సేకరణ కేంద్రాలు మందుబాబులకు నిలయాలుగా మారాయి. ప్రభుత్వ ఆశయం నెరవేరకపోగా నిధుల వృథాతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మండలంలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలు మారాయి. వీటి నిర్వహణ కోసం ప్రతినెలా సుమారు 32 మంది కార్మికులు క్రమం తప్పకుండా గౌరవ వేతనాలిచ్చి వారిచే గ్రామాల్లో అరకొర పనులు చేయించుకొంటున్న అధికారుల తీరే ఇందుకు నిదర్శనం.

–చౌడేపల్లె

నిధులు వృథా.. జనం వ్యథ



చౌడేపల్లెలో చెత్త సంపద కేంద్రం బయట పడేసిన చెత్త

- నిరుపయోగంగా చెత్త సేకరణ కేంద్రాలు
- రూ.కోట్ల నిధుల దుర్వినియోగం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

పరిసరాల్లో పరిశుభ్రతను పాటించడంతో పాటు ఇళ్ల నుంచి వెలువడే తడి , పొడి చెత్తను వేరుచేసి వాటి ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేయాలనే తలంపుతో చెత్త సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో 19 పంచాయతీలుండగా కొండయ్యగారిపల్లె, ఆమినిగుంట మినహా మిగిలిన అన్ని పంచాయతీల్లో లక్షల రూపాయలు ఖర్చు చేసి చెత్త సేకరణ కేంద్రాలు నిర్మించారు. ఒక్కో కేంద్రం నిర్మాణానికి రూ.5 లక్షల వరకు ఖర్చు చేశారు. వీటితో పాటు 10 కంపోస్టు పిట్ నిర్మాణాలు చేపట్టారు. చౌడేపల్లెలో సుమారు రూ.15 లక్షల వ్యయంతో నిర్మించారు.

సేకరణ ఇలా..:

ప్రతి పంచాయతీలో ఇద్దరు లేదా ముగ్గురేసి కార్మికులను నియమించారు. వారికి ప్రతి నెలా రూ.6 వేల గౌరవ వేతనం ఇస్తున్నారు. వారి చేత గ్రామాల్లోని ప్రతి ఇంటి వద్ద తోపుడు బండి ద్వారా తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి వాటి ద్వారా ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలకు తరలించాల్సి ఉంది. అక్కడ నిర్మించిన తొట్టెల్లో తడి, పొడి చెత్త వేరుచేయడంతో పాటు బాటిళ్లు, తదితర వస్తువులను వేరుచేయాల్సి ఉంటుంది. బయట నిర్మించిన కంపోస్టు గుంతల్లో చెత్తను వేసి సేంద్రియ ఎరువుగా మార్చి రైతులకు విక్రయించాలనేది ప్రభుత్వ ఆశయం.

అమలుకు దూరంగా..

కార్మికుల చేత అధికారులు నెల, రెండు నెలలకు ఒకసారి కాలువలు, ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రపరిచే పనులు చేయిస్తున్నారు. దీంతో పాటు చెత్త సేకరణ నుంచి సంపద సృష్టించే దిశగా పనులు జరగడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. చౌడేపల్లె మండల కేంద్రం చెడుగుట్ల పల్లె మార్గంలో ఏర్పాటు చేసిన ఎస్‌డబ్ల్యూ పీసీ కేంద్రంలో చెత్త వేయకుండా కేంద్రం పక్కన ఖాళీ ప్రదేశంలో చెత్తను డంప్ చేశారు. ఎక్కడపడితే అక్కడ చెత్త పడేయడంతో దుర్వాసనతో పాటు నీరు కలుషితం అవుతోంది.దీంతో పంట పొలాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి.

అధికారుల పర్యవేక్షణ కరువు :

కార్మికులు, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల నిర్వహణలో అధికారుల పర్యవేణ లోపించింది. యల్లకుంట్ల కేంద్రంలో తలుపులు మాయం అయ్యాయి. పశువులకు, మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

అలంకారప్రాయంగా కంపోస్టు తొట్టెలు

చెత్త నుంచి సంపద తయారు చేసి విక్రయించి రైతులకు ఎరువుగా పంచాయతీకి ఆదాయ వనరుగా చేయాలనే సదాశయంతో రూపొందించిన వర్మీకంపోస్టు పిట్‌లు అలంకారప్రాయంగా మారాయి. కేంద్రాల వైపు వెళ్లే వారే కరువయ్యారు.



వృథాగా వర్మీకంపోస్టు తొట్టెలు



వినియోగంలో లేని చెత్తసేకరణ కేంద్రం

నేడు కరెంట్ సరఫరాలో అంతరాయం

పలమనేరు: ట్రాన్స్‌కో పరిధిలో పలు విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కరెంట్ సరఫరా ఉండదని స్థానిక ఏడీ చిన్నబ్బ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

12న మండల సర్వసభ్య సమావేశం

కుప్పం: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 12వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాయి లహరి పేర్కొన్నారు. సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని ప్రభుత్వ శాఖ అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

నేడు శ్రీకోనేటిరాయుని కల్యాణోత్సవం

గంగవరం: మండలంలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో నేడు శనివారం శ్రవణానక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు సాయంత్రం 4 గంటల నుంచి స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుందని, పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తులతో రూ.300 చెల్లించి ఇద్దరు చొప్పున పాల్గొనవచ్చని పేర్కొన్నారు. కావున భక్తులు స్వామివారి కల్యాణోత్సవాన్ని కనులారా వీక్షించి తరించాలని కోరారు.

ఆధార్ అగచాట్లు

- గంటల తరబడి నిరీక్షణ



ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం పోస్టాఫీసు వద్ద పడిగాపులు

కుప్పం: ఆధార్ కార్డులో మార్పులు, చేర్పుల కోసం విద్యార్థులు అగచాట్లు పడుతున్నారు. పాఠశాల, కళాశాలల విద్యార్థుల పుట్టిన తేదీలు, పేర్ల మార్పులు , చేర్పులు సరి చేసుకోవాలని ఆధార్ కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్నారు. అపార్ ఐడీ కోసం ఆధార్‌లో తప్పులు లేకుండా సరి చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ నేపథ్యంలో పట్టణంలో ఒకే ఒక్క సెంటర్ అయిన పోస్టాఫీసులో మాత్రమే ఆధార్ కేంద్రం ఉండటంతో విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. గతంలో మీ సేవా, సచివాలయం , బ్యాంకుల వద్ద ఉన్న సెంటర్లను తొలగించారు. కేవలం పోస్టాఫీసులో మాత్రమే ఆధార్ సెంటర్ నడస్తోంది. ప్రతి రోజూ వందల్లో విద్యార్థులు ఆధార్ కార్డులో పేర్ల మార్పునకు తరలి వస్తున్నారు. దీంతో పోస్టాఫీసు ఆవరణ విద్యార్థులతో కిటకిటలాడుతోంది. అదనంగా ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



భక్తులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్

వి.కోట: మండలంలోని దానమయ్యగారిపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం తిరుపతి గంగమాంబ, కుంటి గంగమాంబ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన కుంభాభిషేకం కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మవారి చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

పలమనేరు నుంచి బెంగళూరుకు బస్సులు ప్రారంభం





బెంగళూరుకు ప్రారంభమైన ఆర్టీసీ బస్సులు, డీఎం స్వామిని సన్మానిస్తున్న అయ్యప్ప భక్తులు

పలమనేరు: పట్టణం నుంచి బెంగళూరుకు స్థానిక ఆర్టీసీ డిపో నుంచి బస్సు సర్వీసులు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డీఎం టీకే స్వామి మాట్లాడుతూ.. పలమనేరు నుంచి శుక్ర, శని, ఆది, సోమవారాల్లో బెంగళూరుకు బస్సులను ప్రారంభించామని తెలిపారు. దీంతో స్థానిక పలమనేరు పరిరక్షణ సమితి అధ్యక్ష కార్యదర్శులు సుబ్రహ్మణ్యం పిళ్లై, నరసింహులు సభ్యులతో కలసి స్థానిక డీఎంను డిపో వద్ద ఘనంగా సత్కరించారు. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బెల్ట్‌షాప్ నిర్వాహకుడి అరెస్ట్

గుడిపాల: బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. వివరాలు ఇలా.. పిల్లారికుప్పంకు చెందిన లోకేష్(32) గ్రామంలో బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్నాడని సమాచారం అందడంతో అతని ఇంట్లో తనిఖీలు చేశామన్నారు. అక్కడ 28 క్వార్టర్ బాటిళ్లు ఉండగా, వాటిని స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో ఎక్కడైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు.

సారా ఊట ధ్వంసం



సారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

గుడిపాల: మండలంలో సారా తయారీ స్థావరాలపై దాడి చేసి భారీగా సారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. రాసనపల్లె అటవీప్రాంతంలో సారా తయా రు చేస్తున్నారని సమాచారం అందడంతో శుక్రవారం సిబ్బందితో వెళ్లి దాడులు చేశామన్నారు. ఇందులో సారా ఊట 600 లీటర్లను ధ్వంసం చేసినట్లు చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి విక్రయాలు ఎక్కడైనా జరిగితే వారిపై పీడీ యాక్ట్‌లు కూడా పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని, ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందితే 9440796712 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

భజన మందిరం ప్రారంభం

బైరెడ్డిపల్లె: మండలంలోని గడ్డూరులో శుక్రవారం శ్రీరామచంద్రస్వామి భజన మందిరాన్ని గ్రామస్తులు ప్రారంభించారు. పురోహితులు మురళీధరాచార్యులు ఉదయం గణపతి పూజ, వాస్తుపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. శ్రీరామచంద్రస్వామి చిత్రపటానికి పూలమాలలతో అలంకరించారు. శ్రీరామచంద్రస్వామి దేవాలయం నిర్మించేందుకు గ్రామస్తులు కృషిచేస్తామని తెలిపారు.

కొండచిలువ కలకలం



కొండ చిలువను పట్టుకున్న అటవీశాఖ సిబ్బంది

గుడుపల్లె: జన సంచారంలో కొండచిలువ ప్రత్యక్షం కావడంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. శుక్రవారం మండలంలోని ఆవులతిమ్మనపల్లె సమీపంలో కొండ చిలువ కనబడడంతో స్థానికులు గమనించారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అటవీ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని కొండచిలువను పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలేశారు. కొండచిలువ గ్రామ సమీపానికి రావడంతో రాత్రి సమయాల్లో బయటకు వచ్చేందుకు జనం భయాందోళన చెందుతున్నారు.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి

గుడుపల్లె: రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తహసీల్దార్ సీతారాం కోరారు. శుక్రవారం గుండ్లసాగరం గ్రామంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. గతంలో చేసిన రీ సర్వేలో మార్పులు, చేర్పులు సరిదిద్దుకునేందుకు అవకాశం ఉందన్నారు. గ్రామసభలో 21 అర్జీలను స్వీకరించారు. ఇచ్చిన ప్రతి అర్జీపై రెవెన్యూ అధికారులు ప్రత్యేకంగా చొరవ తీసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. మండలంలో ఇప్పటి వరకు 11 గ్రామ సభలు జరిగాయని, వీటిలో 256 అర్జీలు వచ్చాయని వీటికి ఆయా గ్రామాల్లోని రెవెన్యూ అధికారులు సర్వేయర్ల సహకారంతో సత్వరం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, సర్వేయర్ రత్నప్ప పాల్గొన్నారు.

'జియోట్యాగింగ్' తనిఖీ

పెద్దపంజాణి: మండలంలోని లింగాపురంలో జరుగుతున్న హౌస్ హోల్డ్ జియోట్యాగింగ్ ఆన్‌లైన్ కార్యక్రమాన్ని ఎంపీడీఓ బాలాజీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐడీ కార్డులు లేని ప్రత్యేక ప్రతిభావంతులు సంబంధిత సర్టిఫికెట్లతో సచివాలయ సిబ్బంది వద్ద రిజిస్ట్రేషన్ చేసుకుని సర్టిఫికెట్లు పొందాలని సూచించారు. చివరగా గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలని ఆదేశించారు.

ఆగని ఏనుగుల దాడి

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలంలోని మేకలవారిపల్లె, బోడిరెడ్డిగారిపల్లె, మతుకువారిపల్లెలో శుక్రవారం తెల్లవారుజామున పంట పొలాలపై ఏనుగుల గుంపు దాడి చేసి అన్నదాతలకు భారీగా నష్టం కలిగించాయి. గత వారం రోజుల కిందట అటవీశాఖ సిబ్బంది ఏనుగులను అటవీ ప్రాంతంలోకి తరిమేశారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే శుక్రవారం రాత్రి మరోమారు ఏనుగుల గుంపు దాడి చేయడంతో గ్రామానికి చెందిన మేకలవారిపల్లె సుధాకర్‌కు చెందిన ఎకరా పొలంలోని వరిపంట, అతనికే చెందిన కొబ్బరిచెట్లు, అరటి తోటను తొక్కేశాయి. అలాగే బోడిరెడ్డిగారిపల్లెకు చెందిన రైతు వీరయ్య, మతుకువారిపల్లెకు చెందిన గరడారెడ్డికి చెందిన మామిడితోటలకు వేసిన ఫెన్సింగ్‌ను తొక్కి నాశనం చేశాయి. చేతికొచ్చిన పంటలను ఏనుగులు నాశనం చేయడంతో తమకు తీరని నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. ఫారెస్టు సిబ్బంది పంటలను పరిశీలించి జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు.

గృహ ప్రవేశ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే



వైఎస్సార్‌సీపీ నేత సురేష్ గృహప్రవేశ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

బైరెడ్డిపల్లె: చీలంపల్లె, బైరెడ్డిపల్లె, టీఎస్ కుప్పం తదితర గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన గృహ ప్రవేశ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనకు ప్రజలు అప్పుడే విసిగిపోయారని, ప్రజలు మళ్లీ వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టడం ఖాయమని నేతలతో ముచ్చటించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శి దయానందగౌడ్, సర్పంచులు రవిచంద్ర, వెంకటేష్, బాలకృష్ణగౌడు, రమణారెడ్డి, రాజప్ప, మండల వైఎస్సార్‌సీపీ యూత్ ప్రెసిడెంట్ మహేష్, వైఎస్సార్‌సీపీ నేతలు శంకర్, చంద్రశేఖర్, ప్రభాకర్ రెడ్డి, సురేష్, నారాయణప్ప పాల్గొన్నారు.



పుంగనూరులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులతో ప్రిన్సిపల్ దయానందరాజు

న్యాయసేవలపై ర్యాలీ

పుంగనూరు: పట్టణంలోని ఎన్‌ఎస్ పేటలోగల జూనియర్ బాలుర కళాశాలలో న్యాయసేవల దినోత్సవంపై శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ దయానందరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యాహక్కుతో పాటు పోక్సో చట్టం, వరకట్న నిషేధ చట్టం విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మత్తుపదార్థాల భారిన పడకుండా, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు.

ఉద్యోగాలకు 163 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం





జాబ్‌మేళాలో మాట్లాడుతున్న నిర్వాహకులు, ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు

గంగవరం: మండలంలోని ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన ప్రాంగణ నియామకాల్లో 163 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ ఎంవీఆర్.రెడ్డి తెలిపారు. వరుసగా జరుగుతున్న ప్రాంగణ ఎంపికల్లో మొదటి రోజు 50 మంది, రెండో రోజు 163 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. కాగా రెండో రోజు తమ కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికలో వశిష్టా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ కంపెనీలో 18 మంది, కెరీర్–365 కంపెనీలో 29 , క్వెష్ కంపెనీలో 15 , ఇన్నోవ్ టెక్నాలజీస్ కంపెనీలో 20, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో 21 మంది, ముత్తూట్ ఫైనాన్స్‌లో 8 , ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకులో ఏడుగురు, సెవెన్‌హిల్స్ ఎంటర్‌ప్రైజెస్‌లో 45 మంది కలిపి మొత్తం 163 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్ లక్ష్మీసుధ, అధ్యాపక బృందం అభినందించింది.

పలమనేరులో 45 మంది..

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడప్, డీఆర్‌డీఏల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన మెగా జాబ్‌మేళాలో 45 మంది విద్యార్థులు పలు కంపెనీల్లో ఉద్యోగాలు సాధించినట్లు జిల్లా ప్లేస్‌మెంట్ అధికారులు చైతన్య, లోకేష్, పవన్ తెలిపారు. ఈ జాబ్‌మేళాకు వివిధ బహుళజాతి కంపెనీలైన శ్రీరామ్ చిట్స్, దొడ్ల డెయిరీ, ఇన్‌సోర్స్, ఎస్‌బీఐ లైఫ్ తదితర సంస్థలు పాల్గొన్నాయి. ఇందుకు మొత్తం 98 మంది హాజరు కాగా ఇంటర్వ్యూలో 45 మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వెంకటేశ్వర్లు, సుబ్బయ్యనాయుడు, స్థానిక కోఆర్డినేటర్ సిసింద్రీ పాల్గొన్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

పుంగనూరు: కార్తికమాసం సందర్భంగా ప్రముఖ శైవ క్షేత్రాలైన శ్రీశైలం, యాగంటి పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డీఎం సుధాకరయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 18, 25 తేదీల్లో పుంగనూరు నుంచి బస్సులు నడుపుతున్నామన్నారు. అలాగే ఈనెల 17, 24న శ్రీశైలం, యాగంటి పుణ్యక్షేత్రాలకు సాయంత్రం 4 గంటలకు బయలుదేరి దర్శనం చేసుకుని, తిరిగి ప్రయాణికులను పుంగనూరులో వదిలిపెట్టేందుకు గాను ఈ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. పెద్దలకు రూ.1300, పిల్లలకు రూ.700 టికెట్ ధర నిర్ణయించామన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు డిపోలో సంప్రదించాలని కోరారు.